
సాక్షి పల్నాడు

శనివారం । 6 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 11,809 క్యూసెక్కులు వదిలారు.



మల్లేశ్వరుడి సేవలో కార్మిక మంత్రి

తాడేపల్లి రూరల్ : పెనుమాకలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు.

రేషన్ పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో మంజూరైన 4,138 రైస్‌కార్డులకు ఈనెల నుంచే రేషన్ అందజేస్తున్నట్లు జేసీ ఏ.శ్యాం ప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

గుంటూరు డీఎంహెచ్‌ఓగా డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్ : గుంటూరు డీఎంహెచ్ ఓగా డాక్టర్ కె.విజయలక్ష్మిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అడిషనల్ డీఎంహెచ్ ఓగా కె.విజయలక్ష్మి ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో 1985లో ఎంబీబీఎస్ చదివి 1994లో గాజువాక మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. 2010లో డెప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది విశాఖపట్నం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పనిచేశారు. సివిల్ సర్జన్‌గా 2021లో ప్రమోషన్ పొంది విజయనగరం, విశాఖపట్నం డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. శనివారం విధుల్లో చేరుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు.

9 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు విధిగా సెలవులుగా పరిగణించాలని, ఈనెల 19న పాఠశాలలను పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంపస్‌లను తెరిచి 10వ తరగతి విద్యార్థులకు సైతం తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

17లోపు అంబేడ్కర్ వర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గుంటూరుఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జరగనున్న యూజీ ద్వితీయ, తృతీయ సెమిస్టర్‌లకు సంబంధించిన పరీక్ష ఫీజులను ఈనెల 17లోపు చెల్లించాలని జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ స్టడీ సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త పి. గోపీచంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని, ఇతర వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

26లోపు ఏటీఎల్ మారథాన్‌కు నమోదు చేసుకోవాలి

గుంటూరుఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరు '2023-24 ఏటీఎల్ మారథాన్' జాతీయస్థాయి ఇన్నోవేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 26వ తేదీలోపు ఏటీఎల్.యూనీసాల్వ్.ఓఆర్జీ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్‌ను 9849627708 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 45,624 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 42,502 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,624 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.21,000 వరకు పలికింది.
నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 32,626 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 10న ఫ్రూట్ స్క్వాషెస్ తయారీ, ఈనెల 23న టమాటో, మునగ, పచ్చిమిరప, పొడులను తయారుచేసే విధానంపై ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు శాస్త్రవేత్త డాక్టర్ ఎం. దీప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 చెల్లించాలని ఆమె సూచించారు. వివరాలకు 9959920099ను సంప్రదించాలని కోరారు.

టెన్త్‌లో సత్తా చాటేలా...



మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌కు హాజరైన విద్యార్థులు

- మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు
- జగనన్న విద్యా జ్యోతి పేరిట ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ
- జిల్లాలో ప్రభుత్వ విద్యార్థులు 25,247 మంది
- అంతర్గత పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రతి విద్యార్థిపై దృష్టి

నరసరావుపేటఈస్ట్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో మరి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 251 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో 25,247 మంది విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. వీరంతా వచ్చే మార్చి నెలలో పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో గతేడాది 24,147 మంది పరీక్షలకు హాజరుకాగా కేవలం 16,793 మంది(63.47 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మంచి ఫలితాలు వస్తాయని అధికారులు, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 25,247మంది విద్యార్థులు చదువుతుండగా, వీరిలో ఇప్పటికే 23,958 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. సప్లిమెంటరీ విద్యార్థులు 5,594మంది ఉండగా 4,084మంది పరీక్ష ఫీజు చెల్లించారు.

ప్రత్యేక తరగతులు...

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే దాదాపు 95శాతం సిలబస్ పూర్తవగా, మరో వారం, పది రోజులలో మొత్తం పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహించి విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మెరుగైన ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దనున్నారు. సబ్జెక్టు టీచర్లు వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటల స్టడీ అవర్‌లు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారిని మెరుగుపరుస్తున్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం సబ్జెక్టుల వారీగా రివిజన్, స్లిప్ టెస్టులు నిర్వహించనున్నారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు, గురుకుల సంక్షేమ పాఠశాలల్లో ప్రత్యేకంగా రాత్రి తరగతులు నిర్వహించనున్నారు. వీరితోపాటు సప్లిమెంటరీ విద్యార్థులకు సైతం రెమిడియల్ తరగుతులు ఏర్పాటు చేసి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు.

వంద శాతం ఫలితాలే లక్ష్యంగా..



పదిలో వంద శాతం ఫలితాలే మా లక్ష్యం. అందుకు అనుగుణంగా పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే తీర్చిదిద్దుతున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాం.

–కె.శామ్యూల్, డీఈఓ, పల్నాడు జిల్లా

జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు కార్పొరేట్ పాఠశాల విద్యార్థుల కన్నా మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా జెడ్పీ నిధులతో విద్యార్థులకు 'జగనన్న విద్యా జ్యోతి' పేరుతో స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకొని మంచి మార్కులు సాధించేలా ఈ పుస్తకాలు ఉపయోగపడనున్నాయి. ఏ డే విత్ కలెక్టర్ పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో చదువులో ముందున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రేరేపితులై పోటాపోటీగా చదువుతున్నారు. విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకుంటేనే ప్రయోజనం



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- 2785మందికి రూ.4.18కోట్లు జమ
- మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటేనే ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి నవరత్నాలు కార్యక్రమం కింద అర్హత ఉండి ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులకు బైమాన్యువల్ శాంక్షన్ కింద నేరుగా వారి ఖాతాలలో నిధులు జమచేసే కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎవరెవరికీ ఏఏ పథకం ద్వారా లబ్ధి చేకూరింది వివరాలు సేకరించారు. జిల్లాలో 2,785 మంది లబ్ధిదారులకు రూ.4,18,49,318 భారీ చెక్కును అందజేశారు. అందులో ఈబీసీ నేస్తం పథకం కింద 346 మంది లబ్ధిదారులకు రూ.51,90, జగనన్న అమ్మఒడి పథకం కింద 1,666 మందికి రూ.2,35,89,318, జగనన్న చేదోడు కింద 539 మందికి రూ.59.90లక్షలు, కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా 64 మందికి రూ.54.85లక్షలు, కాపు నేస్తం పథకం ద్వారా 85 మంది లబ్ధిదారులకు రూ.12.75లక్షలు, నేతన్న నేస్తం పథకం కింద ఐదుగురికి రూ.1.20లక్షలు, వాహనమిత్ర పథకం కింద 80 మందికి రూ.8లక్షలు కలపి మొత్తం 2,785 మంది లబ్ధిదారులకు 4,18,49,318 జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సంతృప్తికరం



ఇంటర్మీడియేట్ చదువుతున్న నా బిడ్డకు కొన్ని కారణాలతో రెండో విడత అమ్మఒడి నిధులు ఆగాయి. ఇప్పుడు మంజూరుకావటం చాలా సంతోషం. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సంతృప్తికరంగా ఉన్నాయి.

–పద్మావతి, నరసరావుపేట

సంతోషంగా ఉంది



మేము రాజస్తాన్ నుంచి 12 ఏళ్ల కిందట వచ్చి బండి నడుపుతూ జీవిస్తున్నాం. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారికి బ్యాగు, పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పుడు అమ్మఒడి కింద నిధులు జమకావటం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–రత్నాదేవి, యల్లమంద, నరసరావుపేట మండలం

నేడు ముగ్గురు రాజుల మహోత్సవం

- ఏర్పాట్లు పూర్తి
- గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య ఆధ్వర్యంలో దివ్యపూజ బలి
- దేశవిదేశాల నుంచి పాటిబండ్ల రానున్న క్రైస్తవ సోదరులు



విద్యుత్ దీపాల కాంతులతో పాటిబండ్లలోని ముగ్గురు రాజుల దేవాలయం

పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామంలోని ముగ్గురు రాజుల దేవాలయం తిరునాళ్లకు ముస్తాబైంది. ప్రపంచ నలుమూలల నుంచి అనేక మంది మత గురువులు, మతకన్యలు ఇప్పటికే గ్రామానికి చేరుకున్నారు. శనివారం నిర్వహించే ఈ మహోత్సవంలో గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య హాజరై ప్రత్యేక దివ్య పూజలు నిర్వస్తారని విచారణ గురువులు చిన్నాబత్తిన హృదయ కుమార్, సహాయ గురువులు నందిగం సురేష్ తెలిపారు. మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆదర్శవంతమైన సంఘంగా, విశ్వాసానికి ప్రతీకగా పాటిబండ్లలో నిర్మించిన ముగ్గురు రాజుల దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. హాలెండ్‌లోని మిల్‌హిల్ సభకు చెందిన మత గురువు ఫాదర్ గ్లెస్‌మాన్ 1921లో ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆ క్రమంలో ఇక్కడ ముగ్గురు రాజుల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంలో శిల్పకళలు చూపరులను కట్టిపడేస్తాయి. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శనివారంతో ముగుస్తాయి. జనవరి ఒకటి నుంచి ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు.

కుటుంబానికి ఆడపిల్ల 'బంగారు తల్లి'

- ఆడపిల్లల జననాలను ప్రోత్సహించేలా 'బంగారు తల్లి'
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు



ఆడపిల్ల తల్లికి బేబీ కిట్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు పక్కన కలెక్టర్ శివశంకర్

సత్తెనపల్లి: ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలే కుటుంబానికి బంగారమని, ప్రభుత్వ వైద్యశాలలో ఆడపిల్లల జననాలను ప్రోత్సహించేలా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చొరవ తీసుకొని నిర్వహిస్తున్న 'బంగారు తల్లి' కార్యక్రమం స్ఫూర్తివంతమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలలో 'బంగారు తల్లి' రెండో దశ కార్యక్రమాన్ని మంత్రి అంబటి కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సమూలంగా మార్పులు చేశామన్నారు. సర్కారు వైద్యానికి ఊపిరి పోశామన్నారు. అన్ని అధునాతన సౌకర్యాలు, వసతులు కల్పించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. ప్రస్తుత పాలనకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైద్యశాలల దుస్థితికి బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ 'బంగారు తల్లి' మొదటి దశ కార్యక్రమంలో యుక్త వయసుకు వచ్చిన బాలికలందరిలో రక్తహీనత లేకుండా పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇది సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. 'బంగారు తల్లి' రెండో దశ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలో జన్మించే ఆడపిల్లల కుటుంబానికి ప్రత్యేక కానుకగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రూ.7 లక్షలతో ప్రభుత్వం వైద్యశాలలో నేత్ర విభాగానికి అందించిన ఎస్కాన్, చిట్ లాంపులను వారు ప్రారంభించారు. ఏరియా వైద్యశాలలో నాణ్యమైన సేవలకుగాను జాతీయ గుర్తింపు ధ్రువీకరణ పత్రాన్ని, ముస్కాన్ ప్రశంసాపత్రాన్ని అతిథుల చేతుల మీదుగా వైద్యశాల నిర్వాహకులు అందుకున్నారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు, వైద్యశాల నిర్వహణను, కార్యక్రమాల ఏర్పాట్లను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణను మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ లోతేటి శివశంకర్ అభినందించారు. పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాలల సమన్వయకర్త రంగారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.చంద్రశేఖర్, తహసీల్దార్ ఎస్.సురేష్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ షేక్ కరీం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మకం

- విద్య, ఆరోగ్యం బాగుంటే దేనినైనా జయిస్తారు
- బీపీ, షుగర్‌లకు జీవితకాలం మందులు వాడాల్సిందే
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పెద్దమక్కెన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని, రాష్ట్రంలో ఆరోగ్య రంగం ఓ విప్లవాత్మకమైనదిగా నిలుస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిబిరానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పేద, బడుగు బలహీనవర్గాలకు వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్రంలో పేదలు వివిధ రుగ్మతలు వస్తే వైద్య పరీక్షలు చేయించుకునే స్తోమత లేక రుగ్మతలు ముదిరి ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. అలాంటి ఇబ్బందులను తొలగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రధానంగా రుగ్మతలు నిర్ధారణ అయితే వాటికి అవసరమైన మందులను వాడవచ్చన్నారు. బీపీ, షుగర్ లాంటి రుగ్మతలకు జీవిత కాలం మందులు వాడాల్సిందేనన్నారు. ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండాలని ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా, దేశం గర్వించదగ్గ వైద్య విధానం రాష్ట్రంలో అమలవుతుందని అందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిదర్శనమన్నారు. విద్య, ఆరోగ్యం బాగుంటే దేనినైనా జయించవచ్చని భావించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతున్న తరుణంలో కోట్లాది రూపాయల వ్యయంతో కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటుచేసి ఖరీదైన వైద్య పరీక్షలతోపాటు 165 రకాల నాణ్యమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రజల చెంతకే వైద్యం అందేలా వైద్య సిబ్బందిని ప్రతి ఇంటికి పంపిస్తున్నారని కొనియాడారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతోపాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఉన్నత వైద్యశాలలకు రిఫర్ చేయడం కూడా జరుగుతుందన్నారు. సభలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నిపుణులైన వైద్యులతో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల వారీగా జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందుల కిట్లు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.ఎస్.ఎల్.కవిత, వైఎస్సార్ సీపీ నాయకులు వద్దుల రామకృష్ణారెడ్డి, వద్దుల వేమారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, సచివాలయ కన్వీనర్ అరవ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



నా వయస్సు 35 సంవత్సరాలు. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నా. కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చా. వైద్యులు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలు నా లాంటి వారికి ఎంతో ఉపయోగకరం.

–ఎగిసెట్టి ఆంజనేయులు, పెద్దమక్కెన

చెంతనే వైద్యం .. చాలా బాగుంది



నాకు 45 సంవత్సరాలు. తలనొప్పి, కడుపునొప్పితో బాధపడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నా. వైద్య సేవలు చాలా బాగున్నాయి. వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మా గ్రామానికి వైద్యులను పంపి ఉచితంగా సేవలు అందించడం చాలా బాగుంది.

–గొట్టిముక్కల ప్రసాద్, పెద్దమక్కెన

ఖర్చు లేకుండా వైద్య సేవలు



నేను బీపీ, షుగర్, థైరాయిడ్‌తో ఇబ్బందులు పడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నా. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందించడంతోపాటు మందులు కూడా ఇచ్చారు. సంక్షేమ పథకాలు అమలు చేయడమేగాక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

– చల్ల కస్తూరి, పెద్దమక్కెన

19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- సమష్టిగా విజయవంతం చేయాలి

గుంటూరు వెస్ట్: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల్ని సమష్టిగా విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 9 నుంచి 18 వరకు జన్ భాగిదారి కార్యక్రమం నిర్వహించాలని, దీనికి సంబంధించి జిల్లా నుంచి మండల స్థాయి వరకు కమిటీలు వేయాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, చర్చాగోష్ఠులు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణాల్లోని అంబేడ్కర్ విగ్రహాల్ని సుందరంగా అలంకరించి పూలమాలలు వేయాలని తెలిపారు. జిల్లాస్థాయిలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, మానవహారాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్య కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఈనెల 7 నుంచి 11 లోపు సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ ఫొటోకు పూలమాలలు వేసి ఆయన అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


వెల్దుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా వైఎస్సార్ పింఛన్ కానుక రూ.మూడు వేలు పింఛన్ అందించి మాట తప్పని, మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతున్నారని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం వైఎస్ జగన్ పెంచిన పింఛన్‌ల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల ప్రచారంలో అవ్వా, తాతల పింఛన్ పెంచుకుంటూ రూ.3వేలు చేస్తానని చెప్పి అమలు చేసిన ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. గత ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలో 3436 మందికి పెన్షన్లు అందించి రూ.21కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం 7112 పెన్షన్‌లకు రూ.102కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులకు రూ.75కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.156.78కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద మంగమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ రూప్లీ బాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మేకల కోటిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, కె పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహనీయుడు లూయిూ బ్రెయిలీ

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేటఈస్ట్: అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించి బ్రెయిలీ లిపి ద్వారా వారి పాలిట మహనీయునిగా లూయిూ బ్రెయిలీ శాశ్వత స్థానం పొందారని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. లూథరన్ అంధుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిూ బ్రెయిలీ జయంతి వేడుకలలో కలెక్టర్ శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రవేశ ద్వారం వద్దనున్న లూయిూ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ చూపు కోల్పోయినందుకు నిరాశ చెందకుండా చూపులేని వారికోసం ప్రత్యేక లిపిని ఆవిష్కరించి ఆరాధ్య దైవంగా నిలిచాడని కొనియాడారు. నేటి ఆధునిక ఆవిష్కర్తలకు బ్రెయిలీ స్ఫూర్తి ప్రదాత అన్నారు. లూయిూ బ్రెయిలీ జీవించి ఉండగా అతను ఆవిష్కరించిన లిపిని పట్టించుకోని ప్రపంచం అతను మరణించిన రెండేళ్లకే లూయిూ రూపొందించిన ఆల్ఫాబెట్ సిస్టమ్‌ను ఫ్రెంచ్ ప్రభుత్వం గుర్తించి అంధ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. బ్రెయిలీ సృష్టించిన లిపికి 1982లో ఎలక్ట్రానిక్ బ్రెయిలీ డిస్‌ప్లే, ఎలాక్ట్రానిక్ నోట్స్, డిజిటల్ ఆడియో బుక్స్, కంప్యూటర్ స్క్రీన్ రీడర్ వంటి ఎన్నో ఆవిష్కరణలు జరిగాయన్నారు. అంధుల క్యాలెండర్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా దివ్యాంగుల శాఖాధికారి సువార్త, దివ్యాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్యసేవల క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులోకి తెచ్చిన మౌలిక సదుపాయాలు, అధునాతన వైద్య సేవల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతృప్తి వ్యక్తంచేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. అర్బన్ పీహెచ్‌సీల్లోని వైద్య సేవలన్నింటిని పొందుపరుస్తూ 2024 సంవత్సరం టేబుల్ క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. శుక్రవారం గుంటూరు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో హెల్త్ క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జవ్వాది విజయలక్ష్మి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

నగరంపాలెం: గతేడాది తెనాలి పరిధిలో జరిగిన ఓ చోరీ/ దోపిడీ కేసులో నిందితునికి రెండేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ తెనాలి ఒకటో ఏజేసీజే కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శుక్రవారం అందించిన వివరాలు.. గతేడాది తెనాలి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్(పీఎస్) పరిధిలోని ఓ ప్రాంతంలో చోరీ/దోపిడీ జరగ్గా, కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తెనాలి రజక చెరువు అమ్మ ఆస్పత్రి సమీపంలో ఉంటున్న కోలా రత్నరాజుని సీఐ చంద్రశేఖర్ అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపించగా, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ క్రమంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. ఈ కేసులో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థంగా విచారణ నిర్వహించారు. సాక్ష్యాధారాలతో అతనిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం తెనాలి ఒకటో ఏజేసీజే కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. నిందితునికి శిక్షపడటంలో కీలకంగా వ్యవహరించిన సీఐ చంద్రశేఖర్, ఏపీపీ పి.సునీల్‌కుమార్, కోర్టు లైజన్ ఎస్ఐ శివప్రసాద్, తెనాలి ఒన్ టౌన్ కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

రాజ్యసభ సభ్యుడు బాబుబాయ్ దేశాయ్

మేదరమెట్ల/యద్దనపూడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు బాబుబాయ్ దేశాయ్ అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, యద్దనపూడి మండలంలోని పూనూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పథకాలను సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధి బాటలో పయనించాలని ఆయన కోరారు.

అభివృద్ధే ప్రామాణికంగా ఓటేయ్యండి

- గురుజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేత


లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థ కావాలా, ఎవరైనా చనిపోతే పెన్షన్ ఇచ్చే జన్మభూమి కమిటీల వ్యవస్థ కావాలో మీరే నిర్ణయించుకోండి అని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 12, 13, 15,16 సచివాలయ పరిధిలోని పింఛన్ లబ్దిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో రూ. 3471 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. మూడు తరాలుగా కాసు కుటుంబం పల్నాడు ప్రాంతాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసిందో మీరు చూస్తున్నారన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో గతంలో నీటి కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ప్రతి ఇంటికి నీళ్లు వస్తున్నాయని, కొన్ని వార్డులకు త్వరలోనే వస్తాయని తెలిపారు. మీరు ఎప్పుడు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడ్డారని, కానీ ఇప్పటి వారు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడకుండా బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. మళ్లీ మీరు ఆశీర్వదిస్తే 2024లో గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు అన్నెం పద్మావతి, బంగారు రెడ్డి, జడ సురేంద్ర, జూలకంటి శ్రీనివాసరావు, అజిమ్మర శారద, ఉన్నం ఆంజనేయులు, సైదావలి, గర్నె నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్లా, కత్తెరపు వాసుదేవ రెడ్డి, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, బత్తుల నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం గురప్పనాయుడుపాలెం గ్రామంలో టీడీపీకి నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన 150 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ టీడీపీ కంచుకోట అని చెప్పుకునే గురప్పనాయుడుపాలెం గ్రామంలో ఇలా భారీఎత్తున వైఎస్సార్ సీపీలో చేరడం పార్టీ గెలుపునకు సంకేతమన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు అని ఎంతో ప్రేమతో దగ్గర తీసుకొని రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. రానున్న రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అణగారిన వర్గాలకు అండగా బ్రహ్మనాయుడు ఉన్నాడని చిన్నచూపు చేసేవారందరూ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పార్టీలో చేరిన వారిపై ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఉపకార వేతన పంపిణీ

- 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు అందజేత
- సొసైటీ ఛైర్మన్ కె.బసవపున్నయ్య


విలేకర్ల సమావేశంలో డాక్టర్ బసవపున్నయ్య, వేణుగోపాలరావు, కోటేశ్వరరావు, గోవర్ధనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలోని కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో బసవపున్నయ్య మాట్లాడుతూ పేద, ప్రతిభ కలిగిన అన్ని సామాజిక వర్గాలకు చెంది, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కొంత వరకైనా సహాయం అందించాలనే ఆశయంతో 2003లో సొసైటీని ప్రారంభించినట్లు చెప్పారు. అమెరికాలో స్థిరపడిన డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లి రాధాకృష్ణమూర్తి, కొడాలి రాజవీరయ్య, బొప్పన ద్వారకా ప్రసాద్, కెనడాలో స్థిరపడిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు, గుంటూరుకు చెందిన డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామితోపాటు పారిశ్రామికవేత్తలు కర్నాటి వెంకటేశ్వరరావు, నాట్కో ఫార్మా ముఖ్య దాతలుగా మరి కొంతమంది ఎన్నారైల సహకారంతో వారి ఇచ్చిన, ఇస్తున్న విరాళాలతో 20 ఏళ్లుగా ప్రతి యేటా రూ.35లక్షలకు తగ్గకుండా విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7న కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 21వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ, పీజీ చదువుతున్న 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు చెక్కుల రూపంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. సొసైటీకి రూ.కోటి విరాళాన్ని అందజేసిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు మాట్లాడుతూ డాక్టర్ జాస్తి వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలనే ఆశయంతో తాము సొసైటీని స్థాపించినట్లు చెప్పారు. ఎంపికలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వడ్లమూడి గోవర్ధనరావు, నామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామోదయం, నవోదయం పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపించండి

అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో వినూత్నంగా చేపట్టిన గ్రామోదయం, నవోదయం కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారులు గుర్తించిన పనులపై తగిన ఉత్తర్వులు జారీచేసి త్వరితంగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలువురు మండల ప్రత్యేక అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు గుర్తించిన అంశాలను వివరించారు. ప్రధానంగా గడప గడపకు మన ప్రభుత్వం, దివ్యాంగుల ఓటరు నమోదు, బంగారు తల్లి వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ఐవోసీఎల్ ద్వారా సీఎస్ ఫండ్స్ క్రింద కోటి రూపాయల విలువ చేసే చిన్న పిల్లల క్రీడా పరికరాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సుమారు ఎనభై వేల ఖరీదు చేసే పరికరాలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఉంచే విధంగా ప్రో-అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు. మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులు కలసి ప్రో-అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన పాఠశాలలో మౌలిక వసతులు, ర్యాంపుల పనులు (ఎ.యం.యఫ్) పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు విధులలో చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మార్పు కనపడాలని, ఆ విధంగా అధికారులు ఏకాగ్రతతో పనిచేయాలని సూచించారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతకు చర్యలు

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.శామ్యూల్

శావల్యాపురం: 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.శామ్యూల్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 24 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 179 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థులకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. సమ్మెటీవ్ పరీక్షల మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించి ప్రత్యేక తరగతులు ఉదయం, సాయంత్రం నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈవిద్యా సంవత్సరం నూతనంగా బాలికల జూనియర్ కళాశాల ప్రారంభమైందని, నూరు శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశామన్నారు. విధుల్లో అలసత్వం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరుమెడికల్: కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జనవరి 7న జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 సంవత్సరాల కిందట ప్రారంభమైన ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు తెలుగు రెండు రాష్ట్రాల్లోని 6000 మందికిపైగా ప్రతిభగల విద్యార్థులకు రూ.1.09 కోట్లు ఉపకార వేతనంగా అందజేశామన్నారు. ఈ ఏడాది 500 మంది విద్యార్థులకు రూ.20 లక్షలు అందజేస్తామని తెలిపారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారు కౌండిన్యనగర్‌లోగల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఆదివారం ఉదయం 8గంటలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అతిథులుగా వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత అదనపు కమిషనర్ వై సత్యానారాయణ, ఆదాయపన్ను శాఖ విశ్రాంత ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బి .వెంకటగోపినాథ్, విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, టుబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, రోటరీ మాంక్ డాక్టర్ వడ్లమాని రవి, ఆడిటర్ నండూరి ఆనంద్‌కృష్ణ పాల్గొంటారన్నారు.

సెంట్రల్ జోన్ పోటీలో కృష్ణా జట్టు విజయం

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్-14 బాలుర అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణాజిల్లా జట్టు 41 పరుగుల తేడాతో గుంటూరు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని పరంధామ్ 32, రణధీర్ 31పరుగులు చేయగా, గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, డేవిడ్‌మెలివ్‌న్ 2వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 145 పరుగులు చేసి ఓటమిపాలైంది. జట్టులోని అభినవ్ డేవిడ్ 36, డింకు 26పరుగులు చేయగా, కృష్ణా బౌలర్ సంజయ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, ఏసీఏ రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడు కోటారెడ్డి, డి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరు

యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ


మాట్లాడుతున్న యార్డు చైర్మన్ నిమ్మకాయల

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసిందని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. నిధుల వినియోగంపై యార్డు అధికారులు, మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రూ.60 లక్షలతో నూతన మరుగు దొడ్ల నిర్మాణం, రూ.95 లక్షలతో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.2 కోట్లతో కృష్ణ నగర్ రైతు బజారు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. మిగిలిన నిధులను రైతులకు ఉచిత అల్పాహారం, భోజనం, వసతి, మినరల్ వాటర్ ప్లాంట్‌లకు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. పనులకు తగిన రీతిలో ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కోరారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీరు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శేషగిరిరావు, మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ జేడీ రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు, మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు, యార్డు అదనపు కార్యదర్శులు శివారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.